# నిశ్చల చిత్రం

(పెయింటింగ్ స్టిల్‌లైఫ్ అంటారే అట్లాంటిది ఈ కథ. కథలో సన్నివేశాలు, సంఘటనలూ లేకుండా, పాత్రలు కదలకుండా, సంభాషించకుండా, దృశ్యమాత్రంగా కథనూహించి దానివెంట వెళ్లిపోవటం. శక్తివంతమైన పదచిత్రాలూ, తీవ్రమైన భావావేశమూ ఈ కథలోని ప్రత్యేకాకర్షణలు. కనపడే వస్తువులూ, వీటి వర్ణనా, జరిగిన కథకూ, జరుగుతున్న కథకూ సంకేతాలు. ఏకతారమీద పాడిన విషాద గీతం వంటి కథ)

మంజు శ్రీ

(ఆ రోజుల్లో ఎమెస్కో పాకెట్ బుక్స్ అధినేత శ్రీ ఎమ్.ఎన్.రావు గారు తమ ప్రచురణ రంగానికి తోడుగా 'పుస్తక ప్రపంచం' అన్న మాస పత్రికను ప్రచురించేవారు. నాకు గుర్తున్నంత వరకు జనవరి నెల సాహిత్య సంచికగా తెచ్చేవారు. ఆ సంచికకు శ్రీ మంజుశ్రీగారు సంపాదకులు. 'నిశ్చల చిత్రం' కి వారు రాసిన పరిచయ వాక్యాలు ఇవి.)

ఎలక్ట్రిక్‌పోల్, బల్బు లేదు. ఎర్రటి పోస్టు డబ్బా. దగ్గరలోనే నేలలో పాతిన ఆరడుగుల ఎత్తు రెండు కట్టెలకు 'నేసనళ్ హాట్స్ యూనియన్' తప్పులతో తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో రాసి ఉన్న బోర్డు. ఆ అక్షరాలు కుంటి కుంటిగా, పేద పేదగా జబ్బుపడినట్టుగా ఉన్నాయి. పాత ఇనుపరేకు మీద చిన్న పిల్లల రాతలాంటి అక్షరాలతో బలహీనంగా ఉన్నాయి. అక్కడే కూలిపోయిన మట్టిగోడ కానుకుని సర్కార్ నల్లా. ఆ చుట్టూ చేరుతున్న నల్లటి మురికి నీళ్లలోంచి పుడుతున్న కంపుకొట్టున్న నల్లతాచులా కాలవ ఒకటి ఉంది. ఆ నల్ల తాచు తమ గుడిసెల్లోకి రాకుండా ఉండటానికి ప్రతి గుడిసె ముందు చిన్న అడుగెత్తు గోడలాంటి గట్టు. ఆ నల్లతాచు మెలికలు తిరిగి దగ్గర్లో పాముల బుట్టలాంటి గోతిలో పడుతున్నది.

ఆ ప్రక్కనే గుడిసె ఉంది.

అక్కడికి కార్ల మోటార్ల హోరు వినిపిస్తుంది. విమానాలు తప్పనిసరిగా ఆకాశంలో తిరిగి సుడిగాలుల్లా చెవుల్లను గింగిర్లెత్తిస్తాయి.

ఆరోజు ఆకాశంలో సూర్యుడు నల్లటి ఖరీదయిన మెత్తటి కంబళ్లను కప్పుకున్నాడు. ఆ గుడిసెల్లో ఎక్కడో ఒక దగ్గర గుండెకోతతో ఆడా మగా ఏడుస్తున్న ఏడుపులు వినిపిస్తున్నాయి. చావు బాజాలు పచ్చిగుండెలని పదే పదే పలకరిస్తూ పోతున్నాయి.

ఆ రోజు......

అక్కడ రోజులకి వారాల పేర్లు తెలీవు. తేదీలుతెలీవు.

యజమాని ఉమ్మితే ముఖం తుడుచుకున్న రోజు..... ఒక వివాహిత యువతి ఆత్మహత్య చేసుకున్న రోజు.... ఒక పదేళ్ల పసిపిల్లవాడు మోటరుసైకిల్ కింద పడి చనిపోయిన రోజు.... ఆకలి రోగంతో ఒక ముసలి అవ్వ గుడిసెలో పడి మూలుగుతున్న రోజు..... దొంగతనం చేసి పోలీసుల చేతిలో ఒక యువకుడు దెబ్బలు తింటున్న రోజు..... కూలి దొరక్క అడ్డానుండి గుడిసెకు తిరిగి వచ్చిన రోజు..... భగవంతుని మొక్కుకుని మొరపెట్టుకునే రోజు. మంటల్లాగ, వర్షంలాగ, బండరాళ్ల లాగ ఎండ వస్తుంది, చీకటి వస్తుంది, గాలి వస్తుంది, వాన వస్తుంది.... అన్నీ కన్నీళ్లనే మోసుకొస్తాయి.

* * *

గుడిసె. మనిషి అందులో నిలువునా నిలబడటానిక్కూడా వీల్లేదు. గోడల్లేవు. అసలు గోడల అవసరమే లేదు. చూరే నేల మీద పడుతుంది. బయటి పురుగూపుట్రా లోపలికి రాకుండా ఉంటానికి చూరును ఆనుకునే లోపల ప్రక్క గట్టు. దాన్ని గోడ అనుకోవాలి.

లోపల తాళ్లు తెగిన నులక మంచం మీద చిరుగుల గొంగడి. మంచం క్రింద కాళ్లవేపు గోడ దగ్గర చినిగిన మోటార్ టైర్ చెప్పులు ధూళి పట్టి పడి ఉన్నాయి. ఆ మంచం ప్రక్కనే నేల మీద ముసలితనానికి మూడోకాలు ఊతకర్ర. నాలుగయిదు బీడీ పీకలు.

ఆ గుడిసెలో ఒక ప్రక్క ఆరిపోయిన బొగ్గులకుంపటి. ఆ ప్రక్కన రెండు సత్తు గిన్నెలు. చెడువాసనతో ఒక మట్టి కుండ. రోగంతో చిల్లులు పడిన శరీరం లాంటి తుప్పు పట్టిన కాళీ బిస్కెట్ డబ్బా. అక్కడే చినిగిన ముసలి వెదురుబుట్ట. దాంట్లో ఒక కాగితం పొట్లంలో పిడికెడు నూకలు. రెండు ఎండిపోయిన పచ్చిమిరపకాయలు. ఒక ఉల్లిపాయ. కాళీ అగ్గిపెట్టె.

ఆ నులక మంచం క్రింద ఒక తుప్పుపట్టిన ట్రంక్ పెట్టె. దాంట్లో భద్రంగా దాచుకున్న రకరకాల వస్తువులు. ఎర్రటి గాజులు ఆరు.

పెద్దవాళ్ల చేతులకు సరిపోయే గాజులవి. నల్లపూసల తాడు వున్న పొట్లం. చిన్న ప్లాస్టిక్ కుంకుమ భరిణె. ఆకుపచ్చని రిబ్బన్ ముక్కలు రెండు. చెంపపిన్నులు, దారపు ఉండ, సూది, రెండు ప్లాస్టిక్ దువ్వెనలు.

ఆ ట్రంక్ పెట్టెలో ఓప్రక్క కాగితాల కట్ట. దాంట్లో హెచ్.ఎస్.సీ సర్టిఫికేట్. ఆటల్లో పుచ్చుకున్న సర్టిఫికేట్లు. ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ వాళ్ల కార్డు. ఖర్చుల లెక్కలకో ఓ నోట్ బుక్. దాంట్లోనే చేసిన అప్పుల వివరాలు. కట్టాల్సిన వడ్డీల వివరాలు. కట్నం అని

రాసి, దాని కింద ఖర్చుల జాబితా. ఒక అమ్మాయి పేరు...... పదే పదే రాసిన ఆ పేరు ఆ పిల్లతో చూసిన సినిమాల పేర్లు. పదహారు పదిహేడేళ్ల ఆ అమ్మాయి ఫోటో. తెలుపు నలుపు రంగుల్లో ఆ అమ్మాయి ముఖం ఒక్కటే ఆ ఫోటోలో.

వేరే నోట్‌బుక్కు దినచర్య.

దాంట్లో ఒక అమ్మాయి పుట్టిన రోజు వివరాలు. జాతకచక్రం. ఆ పుట్టిన తేదీ పేజీల తర్వాత ఏభై ఎనిమిది అక్టోబర్ ఆరో తేదీ తర్వాత పేజీలన్నీ ఖాళీ.

ఆ ట్రంక్‌పెట్టెలో ఒక చీర ఉంది. కొన్నేళ్లుగా దాన్ని ఎవరూ కట్టుకోలేదు. లేతాకుపచ్చరంగు నేతచీర. ఎర్రంచు. జాకెట్లు రెండు ముదురు కెంపురంగువి. శృంగారం ఉద్రేకాన్ని చెపుతున్నట్టుగా బలవంతంగా చించితే తిరిగి పోయిన జాకెట్లు నీలం. బూడిద రంగుల్లో రెండు.

ఆ ట్రంక్‌పెట్టెలో ఓ ప్రక్క కాగితాల కట్ట. దాంట్లో నాలుగో తరగతి పుస్తకాలు రెండేళ్ల క్రితం నాటివి. ఆ పుస్తకాల మధ్య నెమలి కన్నులు రెండు. తిరుపతి వేంకటేశ్వరస్వామి బొమ్మలు. పాత స్టాంపులు. బ్లేడు.

ఆ కాగితాల కట్ట ప్రక్కనే స్కిప్పింగ్ రోప్. దాన్ని వాడినట్టుకూడా లేదు. ఆ ప్రక్కనే రెండు గౌనులు. వాటి మడత కూడా విప్పినట్టు లేదు.

ఆ గుడిసెని నాలుగు దినాలుగా ఊడ్చినట్టు కూడా లేదు. లోపల చెమ్మగా ఉంది. నీళ్ల బిందె దగ్గర చీమల పుట్ట లేచింది. నాలుగు దినాలుగా ఏ వస్తువు ఎక్కడ ఉన్నది అక్కడే ఉంది. మంచం తలవేపు కోడు దగ్గర పలుగూ గడ్డపార నేల మీద పడి ఉన్నాయి. మంచం కిందున్న అరిగిపోయిన చెప్పులు అట్లానే పడి ఉన్నాయి.

ఆ రోజు పన్నెండు గంటల సమయాన ఆ గుడిసె ముందు వాకిట్లోకి నులక మంచం వచ్చింది. అక్కడ నాలుగు పచ్చి వెదురు కర్రలు పడి ఉన్నాయి. సుతిలీ చుట్ట ఓ ప్రక్కన పడి ఉంది. ఒక చిన్న కొత్త మట్టి కుండకి తాడు కట్టి ఉంది. దాంట్లో నిప్పులు మండుతున్నాయి. లేతగా పొగవస్తున్నది. పేలాలతో ఓ బుట్ట ఉంది. కొత్త పంచెలు రెండు పడి ఉన్నాయి. కుంకుమ పొట్లం, గుగ్గిలం పొట్లాలు ఆ నిప్పులు మండుతున్న మట్టికుండ ప్రక్కనే పడి ఉన్నాయి.

అక్కడ అంతా నిశ్శబ్దం.

*

*ఏప్రిల్ 1968, 'పుస్తక ప్రపంచం' ఎమెస్కో మాసపత్రిక*